నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
సోమవారం | జనవరి 01, 2024 | www.navatelangana.com

దరఖాస్తు ఫారాలు విక్రయిస్తే చర్యలు

- జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నా రెడ్డి మోహన్ రెడ్డి
- నవతెలంగాణ కథనానికి స్పందన

నవతెలంగాణ-రామారెడ్డి

ప్రజా పాలన దరఖాస్తులను పలు జిరాక్స్ సెంటర్లు మండలంలో విక్రయిస్తున్నాయని నవ తెలంగాణ పత్రికలో శనివారం అంగట్లో ప్రజ పాలన దరఖాస్తులు వచ్చిన కథనానికి స్పందిస్తూ, జిరాక్స్ సెంటర్లో దరఖాస్తు ఫారాలు విక్రయిస్తే చర్యలు తప్పవని జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నా రెడ్డి మోహన్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ప్రభుత్వం ఉచితంగా ఫారాలను అందిస్తుందని, ఒకవేళ ఎక్కడైనా నిలువ లేకపోతే, తర్వాత రోజు ప్రభుత్వమే సరఫర చేస్తుందని, ప్రజలు ఫారాలను కొనుగోలు చేయవద్దని సూచించారు. అధికారులు దరఖాస్తు ఫారాల సమస్యపై వెంటనే స్పందించి, సమస్య పరిష్కారానికి కృషి చేయాలని ఆయన వారికి సూచించారు.

7వ తేదీ వరకు పోలీస్ యాక్ట్ అమలు

ఎస్పీ

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో వుంచుకొని (జనవరి 1వ తేది నుండి 07 వ తేదీ వరకు) పాటు జిల్లా వ్యాప్తం గా 30,30 (ఎ) పోలీసు యాక్ట్ 1861 అమలులో ఉంటుందని కామారెడ్డి జిల్లా ఎస్.పి.సిహెచ్.సింధు శర్మా తెలిపారు. దీని ప్రకారం పోలీసు అధికారుల అనుమతి లేకుండా జిల్లా ప్రజలు ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలిలు, పబ్లిక్ మీటింగ్ లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని తెలిపారు. అలాగే ప్రజాధనాన్ని నష్టం కలిగించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని ఎస్.పి హెచ్చరించారు. జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు తమకు ఈ విషయంలో సహకరించాలని తెలిపారు.

మరింత ఉత్సాహంగా పనిచేద్దాం

- న్యూయర్ శుభాకాంక్షలు తెలిపిన ఎస్పీ

నవతెలంగాణ-కామారెడ్డి



ప్రజల సంతోషాలే మనకు వేడుకలు అని జిల్లా ఎస్పీ సిహెచ్ సింధు శర్మ అన్నారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ నిత్యం సవాళ్లతో కూడుకున్న పోలీసు వృత్తికి ఏరోజుకారోజు కొత్తదనం ఉంటుందని, ప్రజల సంతోషాలే మనకు వేడుకలు అవుతాయని జిల్లా ఎస్.పి .సిహెచ్.సింధు శర్మా అన్నారు. 2024 నూతన సంవత్స రాన్ని పురస్కరించుకుని జిల్లా ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భాంగా ఆమె మాట్లాడుతూ.. ఒక ఏడాది కాలంలో మన జయాపజయాలను బేరీజు వేసుకుని మరింత ఉత్సాహంగా పని చేసేందుకు ప్రణాళికలు రూపొందించుకుందామని అన్నారు. నిన్నటికన్నా మెరుగైన ఫలితాలు రాబట్టుకునేందుకు, వృత్తి నైపుణ్యాలకు మెరుగు పెట్టుకోవడం, ఆచరణలో పెట్టడానికి ఇటువంటి సందర్భాలను వినియోగించుకోవాలని పేర్కొన్నారు. జిల్లా ప్రజలు పోలీసు శాఖ పట్ల స్నేహపూర్వకంగా ఉండడం ఎంతో సంతోషకరమని, ఈ బంధాన్ని పటిష్టపరచడంలో మనం నిరంతరం కృషి చేద్దామని అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో గతేడాది సాధించిన ఉత్తమ ఫలితాలకు సిబ్బంది చేసిన కృషి అద్వితీయమని, లోపాలను సరిదిద్దుకుంటూ ముందుకు వెళదామని పోలీస్ ఇబ్బందికి పిలుపునిచ్చారు. పోలీసు సిబ్బంది, కుటుంబాలు, జిల్లా ప్రజలు ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు. జిల్లా ప్రజలతో పాటు ప్రజాప్రతినిదులకు, పాత్రికేయులకు పోలీసు శాఖతో సమన్వయంగా పనిచేసే అన్నీ శాఖల అధికారులకు, సిబ్బందికి 2024 నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలియజేశారు.

హద్దుదాటితే చర్యలు తప్పవు

కొత్త సంవత్సరం వేడుకలను ప్రతి ఒక్కరు పోలీసులు సూచించిన నిబంధనలకు లోబడి నిర్వహించుకోవాలని దేవునిపల్లి ఎస్సై రాజు అన్నారు. నూతన సంవత్సర వేడుకలను అర్ధరాత్రి దాటాక కొనసాగిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆదివారం రాత్రి 8 గంటల నుండి డ్రంక్ అండ్ డ్రైవ్, డ్రగ్ టెస్టులు చేయబోతున్నట్లు ఆయన తెలిపారు. మద్యం తాగి బండి నడిపితే బండి సీజ్ చేస్తామని, పదివేల రూపాయల జరిమానా, ఆరు నెలల జైలు శిక్ష ఉంటుందన్నారు. దీన్ని ప్రజలు గమనించాలని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

అన్ని రంగాల్లో రాణించి సుఖసంతోషాలతో విలసిల్లాలి

- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

నవతెలంగాణ-కామారెడ్డి


కలెక్టర్ జితేశ్ వి పాటిల్

జిల్లా ప్రజలు అన్ని రంగాలలో రాణించి సుఖసంతోషాలతో విలసిల్లాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. 2024 ఆంగ్ల నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని కలెక్టర్ జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఏడాదంతా ప్రతి ఒక్కరికి శు భాలను చేకూర్చాలని, ప్రతి కుటుంబంలో ఆనందం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. జిల్లా ప్రజలం దరు ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని అభిలషించారు. కొత్త ఏడాదిలో సరికొత్త ఆలోచనలు, ఆశయాలు, ఆకాంక్షలతో ముందుకు సాగాలన్నారు. గత అనుభవాలను మననం చేసుకుంటూ నూతన సంవత్సరంలో మరింత పట్టుదల, అవిరళ కృషితో విజయాలను కైవసం చేసుకోవాలని ఆకాంక్షించారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో రెట్టించిన ఉత్సాహంతో పనిచేస్తూ జిల్లాను ప్రగతి పథాన పయనింపజేసేందుకు కలిసికట్టుగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు.

కొంగొత్త ఆశలతో..



- నూతన సంవత్సరానికి స్వాగతం
- ఘనంగా న్యూఇయర్ వేడుకలు
- ఉత్సవంగా పాల్గొన్న యువత
- బేకరీల వద్ద సందడి.. వైన్స్‌ల వద్ద బారులు
- డేగకన్నుతో వేడుకలను పర్యవేక్షించిన పోలీసులు
- కమిషనరేట్ పరిధిలో ఆంక్షలు అమలు
- పకడ్బందీగా డ్రంకన్ డ్రైవ్ చెకింగ్

నవతెలంగాణ-నిజామాబాద్ డెస్క్/కంఠేశ్వర్

కొత్త ఆశలతో ఉమ్మడి జిల్లా ప్రజానీకం 2024 నూతన సంవత్సరానికి స్వాగతం పలికింది. ఆదివారం రాత్రి నుంచి తెల్లవారు జాము వరకు న్యూ ఇయర్ వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. యువతతో పాటు ప్రజలందరూ న్యూఇయర్ వేడుకలను ఎంతో సంతోషంగా నిర్వహించు కున్నారు. కేక్ కటింగ్ చేసి, బాణాసంచాలు పేల్చి నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. పలుచోట్ల ప్రత్యేక ఈవెంట్లు ఏర్పాటు చేశారు. వేడుకల సందర్భంగా బేకరీల వద్ద సందడి నెలకొంది. మద్యం ప్రియులు వైన్స్ వద్ద బారులు తీరిన పరిస్థితి కనిపించింది. అయితే ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు డేగ కన్నుతో వేడుకలను పర్యవేక్షించారు. కమిషనరేట్ పరిధిలో ఆంక్షలను అమలు చేశారు.

బేకరీల వద్ద సందడి వాతావరణం

న్యూ ఇయర్ వేడుకల్లో ప్రధానమైనది కేక్‌లు. తప్పకుండా అందరూ కేక్ కట్ చేసి నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతున్నారు. కాబట్టి బేకరీ నిర్వాహకులు 2024 పేరుతో ప్రత్యేక కేక్‌లను తయారు చేశారు. భారీ సంఖ్యలో కేక్‌లు అమ్ముడుపోయాయి. కేక్‌ల కోసం ప్రజలు బేకరీల వద్దకు భారీగా రావడంతో అక్కడ సందడి వాతావరణం నెలకొంది.

వైన్స్ వద్ద బారులు

నూతన సంవత్సర వేడుకల సందర్భంగా వైన్స్ వద్ద ప్రజలు ఉదయం నుంచే బారులు తీరారు. రాష్ట్ర ప్రభుత్వం వైన్స్‌కు అర్ధరాత్రి 12గంటల వరకు, బార్‌లకు రాత్రి ఒంటి గంట వరకు అనుమతి ఇచ్చారు. దాంతో చివరి నిమిషం వరకు కూడా యువత వైన్స్ వద్ద మద్యం కొనుగోలు చేశారు. పెద్ద మొత్తంలో మద్యం అమ్మ కాలు జరిగి నట్టు సమాచారం.

పోలీసుల డేగకన్ను

నూతన సంవత్సర వేడుకలపై పోలీసులు డేగ కన్ను వేశారు. ముందు నుంచి ఎలాంటి అవాంఛనీ ఘటనలు జరగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టారు. ఈవెంట్ల నిర్వహణకు తప్పకుండా అనుమతి తీసుకోవాలని ముందే హెచ్చరికలు జారీ చేశారు. అలాగే ఆంక్షలు సైతం అమలు చేశారు. దాంతోపాటు డ్రంకన్ డ్రైవ్ పక్కాగా నిర్వహించారు. రాత్రి ఎనిమిది గంటల నుంచి డ్రంకన్ డ్రైవ్ చేపట్టారు.

ఇక కొత్త సంవత్సరం వేడుకల నేపథ్యంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా బేకరీలు, హోటళ్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, వైన్ దుకాణాలు కిక్కిరిసి పోయాయి. నగరంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల నేపథ్యంలో కట్టుదిట్టమైన నియంత్రణ చర్యలు చేపట్టారు. చాలామంది న్యూఇయర్ వేడుకలను కుటుంబీకుల మధ్యలో నిర్వహించుకున్నారు. భవంతులపై, దాబాలపై అర్ధరాత్రి వరకు నృత్యాలు చేస్తూ 12 గంటలకు కేక్‌లు కట్ చేసి 2024 సంవత్సరానికి స్వాగతం పలికారు. కొందరు స్నేహితులతో నూతన సంవత్సర వేడుకలు జరుపుకోగా, మరికొందరు కుటుంబీకుల మధ్యవేడుకలు నిర్వహించుకున్నారు.

నగరంలోని ప్రధాన కూడళ్ల వద్ద పహారా చేపట్టారు. నగరంలోని గాంధీచౌక్, ఆర్ ఆర్ చౌరస్తా, పులాంగ్ తదితర ప్రాంతాల్లో బందోబస్తు చేపట్టారు. బేకరీ, హోటళ్లు కొనుగోలు దారులతో సందడిగా మారాయి. న్యూఇయర్ వేడుకల నేపథ్యంలో బేకరీలు, హోటళ్లు, ప్రత్యేక ఆఫర్లతో వినియోగదారులను ఆకట్టుకునే ప్రయత్నం చేశాయి. ఈ నేపథ్యంలో ప్రధాన కూడళ్ల వద్ద కేక్‌లు అమ్మకంతో పాటు ప్రత్యేక నాన్ వెజ్ వంటకాలను ఏర్పాటు చేశారు.






పేదలకు ఉచిత వైద్యం అందిస్తాం

- బిహెచ్‌యంయస్ (హోమియో) డాక్టర్ స్పందన

నవతెలంగాణ-కామారెడ్డి


పట్టా అందుకున్న స్పందన

వారిది కులాంతర ఆదర్శ వివాహం. పేదలకు నిస్వార్థ సేవ చేస్తునే వారి పిల్లలను ఉన్నత చదువులు చదివించారు. చిన్న కూతురు స్పందనను బిహెచ్‌యంయస్ డాక్టర్ చదివించాలని లక్ష్యంతో ఎంతో కష్టపడి చదివించగా స్పందన, తల్లిదండ్రుల కష్టాన్ని వృథా కానివ్వలేదు. ఆదివారం డాక్టర్ పట్టా సాధించింది. తన తల్లిదండ్రుల ఆశయాలకను గుణంగా పేదలకు ఉచిత వైద్య సేవలందిస్తా అని తెలిపారు.

కామారెడ్డి జిల్లాలోని బీబీపేట మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన సిబిత-సిద్ధిరాములు చదువుకునే రోజుల నుంచే పేద విద్యార్థులకు నిరుపేదలకు న్యాయం చేసేందుకు ఉద్యమాల బాట పట్టారు. ఎంతో మందికి ఆదర్శ వివాహాలు చేయించారు. పేదలకు ఉచిత చదువులు, వైద్య సేవలు అందించేలా కృషి చేశారు. తల్లిదండ్రుల అభ్యుదయ, సామాజిక ఉద్యమ ఆలోచనలకు తగ్గట్టుగానే పిల్లలు చదువుకొన్నారు. స్పందన డాక్టర్ కావడంతో కూతురితో ఉచిత వైద్య చేయించాలని ఆలోచనతో ముందుకు వెళుతున్నట్లు వారు తెలిపారు. పేదలకు సరైన వైద్య సౌకర్యం అందక ఎంతో మంది పేదలు ఇబ్బందులు పడుతున్నారని, తనను చదివించిన తల్లిదండ్రుల ఆశయాలకనుగుణంగా తన వృత్తిని కొనసాగిస్తానని తెలిపారు.

గ్యాస్ వినియోగంపై ఇంటింటా సర్వే

నవతెలంగాణ-లింగంపేట్


వివరాలు నమోదు చేసుకుంటున్న సిబ్బంది

గ్యాస్ వినియోగంపై ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నట్టు భారత్ గ్యాస్ డీలర్ అంజాద్ హుస్సేన్ తెలిపారు. ఆదివారం లింగంపేట్ మండల కేంద్రంలోని భారత్ గ్యాస్ ఆధ్వర్యంలో రాష్ట్ర భారత్ గ్యాస్ అధికారుల ఆదేశానుసారం ప్రతి సంవత్సరం గ్యాస్ వినియోగించే వినియోగదారులకు వెళ్లి గ్యాస్ వినియోగం ఎలా వినియోగిస్తున్నారు. అదేవిధంగా గ్యాస్ వాడకం వల్ల ఇబ్బందులు తదితర అంశాలను అడిగి తెలుసుకుని నమోదు చేసుకుంటున్నమన్నారు. గ్యాస్ వినియోగించే గృహిణులు తప్పకుండా గ్యాస్ వినియోగంలో సమస్యలు ఉన్నట్లయితే సర్వే సిబ్బందికి వివరించాలన్నారు. బీమా సౌకర్యం కోసం పూర్తి వివరాలు వారికి అందించాలన్నారు. వారు అడిగిన ప్రశ్నలకు పూర్తి సమాధానాలు ఇవ్వాలన్నారు. వివరాలన్నీ అందించాలన్నారు. గ్యాస్ వినియోగంలో సమస్యలు తలెత్తుతో ఇబ్బందులు ఎదురైతే సర్వే సిబ్బందికి వివరించాలన్నారు. జనవరి నెల వరకు గ్యాస్ వినియోగించే ప్రతి ఒక్కరి వివరాలు తీసుకొని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని అన్నారు. అంతేకాకుండా వారికి బీమా సౌకర్యం సైతం కల్పించనున్నట్టు తెలిపారు. సర్వే సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

దోస్పల్లిలో వైద్యశిబిరం

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని దోస్పల్లి గ్రామంలో సిగ్మా సూపర్ స్పెషాలిటీ నిజామాబాద్ ఆధ్వర్యంలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించినట్టు ఆర్‌ఎంపీ పోచారం సుధాకర్ తెలిపారు. గ్రామంలో సాధారణంగా పలువురు ఎదో ఒక ఆరోగ్య సమస్యతో సతమతమవుతున్నారని, సమస్య తెలియాలంటే వైద్య పరీక్షలు చేస్తే తప్ప తెలియదని తెలిపారు. ఖచ్చితంగా నిర్ధారణ పరీక్షలు చేస్తే సమస్య తెలియవస్తుందని, అనంతరం ట్రీట్ మెంట్ చేస్తే ఎంత పెద్ద ఆరోగ్య సమస్య

ఇంటింటికీ మంచినీళ్లు అందేనా..?

- ఆర్‌డబ్ల్యూఎస్ శాఖకు కొత్త ఎమ్మెల్యే ఆదేశాలు ఇచ్చేనా..

నవతెలంగాణ-మద్నూర్


ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్ష చేపట్టిన ఎమ్మెల్యే లక్ష్మీకాంత్‌రావు(ఫైల్)

తెలంగాణ రాష్ట్ర ప్రజలు మార్పును కోరుకుంటూ బిఆర్‌ఎస్ పార్టీని కాదంటూ అధికారంలోకి కాంగ్రెస్ పార్టీని తీసుకురావడం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజా సంక్షేమం వైపు అడుగులు వేస్తున్నట్లు ప్రజాప్రతినిధులు పేర్కొంటున్నారు. జుక్కల్ ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ సాధించిన హనుమంతు షిండే జుక్కల్ నియోజకవర్గంలో బిఆర్‌ఎస్ పార్టీ ప్రవేశపెట్టిన మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికి మంచి నీటి సౌకర్యం అందించలేకపోయారని సొంత పార్టీ సర్పంచ్‌లు సైతం బహిరంగంగానే విమర్శలు వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో హనుమంతు సిండేను కాకుండా జుక్కల్ ప్రజలు కొత్తగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తోట లక్ష్మీకాంత రావును గెలిపించుకున్నారు. కొత్తగా గెలిచిన జుక్కల్ ఎమ్మెల్యే తోటా లక్ష్మీకాంతరావు నియోజకవర్గం అభివృద్ధి కోసం ప్రత్యేకంగా చొరవ చూపేనా అని మండల వాసులు చర్చించుకుంటున్నారు. ప్రతి శాఖ అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్ష సమావే శాలు నిర్వహిస్తున్నారు. ఇటీవల ఆర్డబ్ల్యూఎస్ శాఖ అధికారులతో అచ్చంపేట గెస్ట్ హౌస్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కొత్త ఎమ్మెల్యే అధికారులకు ఎలాంటి ఆదేశాలు ఇచ్చారో అని ప్రజలు ప్రశ్నించుకుంటున్నారు. ఇంటింటికి మిషన్ భగీరథ మంచినీళ్లు అందించడానికి చర్యలు చేపట్టేనా అని ఎదురుచూస్తున్నారు. ఎమ్మెల్యే తోటా లక్ష్మి కాంతారావు హాయంలో నైనా ఇంటింటికి మంచినీటి పథకం అమలు అయ్యేవిధంగా ప్రత్యేక చర్యలు చేపట్టాలని నియోజకవర్గ ప్రజలు ఎమ్మెల్యేను కోరుతున్నారు. ఏళ్ల తరబడి ఇంటింటా మిషన్ భగీరథ పథకం మంచినీటి సౌకర్యం అందించడంలో ఆర్డబ్ల్యూఎస్ అధికారులు పూర్తిగా నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నారని అలాంటి అధికారుల పనితీరుపై నూతన ఎమ్మెల్యే హయంలో నైనా ఆర్డబ్ల్యూఎస్ అధికారులు సక్రమంగా విధులు నిర్వహించి ఏళ్ల తరబడి ఎదురుచూసే మంచినీటి సౌకర్యం వెంటనే ప్రజలకు అందే విధంగా అధికార గణం ప్రత్యేకంగా చర్యలు చేపట్టేనా అని ప్రజలు ఎదురుచూస్తున్నారు.

ఘనంగా ఎస్‌ఎఫ్‌ఐ 54వ ఆవిర్భావ దినోత్సవం

నవతెలంగాణ-కంఠేశ్వర్



జెండా ఆవిష్కరంచి ఆవిర్భావ వేడుకలు నిర్వహిస్తున్న నాయకులు

ఎస్ఎఫ్ఐ న్యాల్కల్ స్కూల్ హాస్టల్ కమిటీ ఆధ్వర్యంలో ఎస్ఎఫ్ఐ 54వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జెండాను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ హాస్టల్ కమిటీ కార్యదర్శి బాబు రావు మాట్లాడుతూ.. భారతదేశంలో విద్యార్థి సంఘం ఎస్ఎఫ్ఐ గత 54 సంవత్సరాల నుండి నిరంతరం విద్యారంగ సమస్యల పైన సమరశీల పోరాటాలు నిర్వహించిందని అన్నారు. ఎస్ఎఫ్ఐ 1970 డిసెంబర్ 30,31 తేదీలలో కేరళ రాష్ట్ర రాజధాని త్రివేంద్ర నగరంలో ఏర్పడి స్వాతంత్రం, ప్రజాస్వామ్యం, సోషలిజం లక్ష్యాలతో భగత్ సింగ్, సావిత్రి భాయి పూలే, అంబేద్కర్ లాంటి అనేకమంది స్వతంత్ర సమరయోధుల వారసత్వాన్ని పుణికి పుచ్చుకొని నిరంతరం విద్యారంగ సమస్యల పైన పోరాటం చేస్తుందని అన్నారు. అధ్యయనం-పోరాటం నినాదాలు ఎంచుకొని విద్యారంగ సమస్యలపై అలుపెరగని పోరాటాలు చేసిందన్నారు. దేశంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యనంతా ప్రైవేటీకరణ, కార్పొరేట్కరణ, కాషాయీకరణ చేస్తుందని తెలిపారు. పేదలకు విద్య అందని ద్రాక్ష లాగా తయారుచేసిందని ఆయన అన్నారు. విద, ఉపాధి ఉద్యోగ అవకాశాల కోసం ఎస్ఎఫ్ఐ చేసే సమస్యల పోరాటాలకు సిద్ధం కావాలని విద్యార్థి లోకానికి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ హాస్టల్ కమిటీ సభ్యులు వంశీ,రోహిత్, వర్ధరజ్, సజాన్,గోవర్ధన్, రామ్ సింగ్, హాస్టల్ విద్యార్థులు పాల్గొన్నారు.

మఠాన్ని సందర్శించిన ఎంపీ, మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-జుక్కల్


మఠంలో ఎంపీ బీబీపాటిల్, మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే

మండలంలోని దోస్‌పల్లి శివారులో గల నరేంద్రమహారాజ్ మఠ్ సంస్థాన్ ఉపపీఠాన్ని ఎంపీ బీబీ పాటిల్, మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే ఆదివారం సందర్శించారు. అనంతరం ట్రస్ట్ నిర్వహించిన అన్న ప్రసాదం ప్రారంభించి మహాప్రసాదం స్వీకరించారు. సాదారణ దర్శనంలో ఎప్పుడిమాదిరిగా ప్రతి ఏటా కలుస్తామని, అందులో భాగంగా కలిసినట్టు తెలిపారు. వీరి వెంట జుక్కల్ సర్పంచ్ బొంపెలి రాములు, విండో చైర్మన్ శివానంద్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాయాగౌడ్, సీనియర్ బీఆర్ఎస్ నాయకుడు నీలుపటేల్, మాజీ సర్పంచ్ బొల్లి గంగాధర్, స్థానిక బీఆర్ఎస్ పార్టీ టౌన్ యూత్ నాయకుడు రాజుపటేల్, మండల పార్టీ అధ్యక్షుడు మాదారావ్ దేశాయి, యువనాయకులు వాగ్రే రమేష్, తదితరులు పాల్గొన్నారు.

లొంగన్‌లో బీరప్ప వేడుకలు

నవతెలంగాణ-జుక్కల్


ఊరేగింపులో కులస్తులు

మండలం లోని లొంగన్ గ్రామంలో గ్రామ సర్పంచ్ నాగలగిద్దే ఉషారాణీ సదుపటేల్ అధ్యక్షతన కుర్మసంఘం గ్రామ నాయకులు ఘణంగా బీరప్పా వేడుకలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు సాదుపటేల్ మాట్లాడుతూ ప్రతి యేటా కుర్మ యాదవ, ఇతరులు కలిసి గ్రామస్తులు కలిసి మహిళలు బోనాలను ఎత్తుకుని డప్పు, వాయిద్యాలు, బాజా భజంత్రిలతో నియమ నిష్టతో బీరప్ప పండుగ నిర్వహిస్తామని తెలిపారు. పోతరాజుల నృత్యాలు, విన్యాసాలను ప్రజలు తిలకించారు. గ్రామస్తులు వందలాదిగా తరలి వచ్చారు. పట్టణాలలో ఉన్న వారు తిరిగి గ్రామనికి రావడంతో గ్రామములో పండుగ వాతావరణం నెలకొంది. ఇంటి ముందు ముగ్గులు, పేడతో సాన్పు వేసి నియమ నిష్టతో నైవేద్యాలు ఊరేగింపుగా తీసుకెళ్లి సమర్పించారు. అనంతరం మహ అన్నదానం నిర్వహించారు. బీరప్ప పండుగను గ్రామస్తులు ప్రశాంతంగా చేపట్టుకున్నారు.

ప్రభుత్వ కళాశాలలో ప్రాక్టికల్స్

నవతెలంగాణ-తాడ్వాయి

ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని తాడ్వాయి మండల కేంద్రంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వార్షిక పరీక్షల రివిజన్ తరగతులపై కళాశాల అధ్యాపకులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. వివిధ సబ్జెక్టులలో వెనుకబడిన విద్యార్థులను రెగ్యులర్గా కళాశాలకు రప్పించే ప్రయత్నం చేస్తున్నారు. వివిధ కారణాలతో గైర్హాజర్ అయ్యే విద్యార్థులకు ప్రతిరోజు ఫోన్ కాల్స్ చేస్తూ కౌన్సెలింగ్ చేస్తున్నారు. అలాగే గత రెండు రోజులుగా కళాశాలలో సైన్స్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ నిర్వహిస్తూ విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేస్తున్నారు. సైన్స్ విభాగానికి సంబంధించి బైపీసీ, ఎంపీసీ గ్రూపులు చదివే విద్యార్థులకు భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం, వృక్షశాస్త్రం, జంతు శాస్త్రాలలో సెకండ్ ఇయర్ విద్యార్థులకు వార్షిక పరీక్షలతో పాటు ప్రాక్టికల్ పరీక్షలు కూడా ఉంటాయి. ఇందుకోసం ఆయా సబ్జెక్టుల అధ్యాపకులు ప్రతిరోజు విద్యార్థులకు ప్రాక్టికల్ తరగతులు కూడా నిర్వహిస్తున్నారు. ఉదయం పూట సబ్జెక్టు బోధనా తరగతులు నిర్వహిస్తూ మధ్యాహ్నం వేళ ఆయా సబ్జెక్టులకు సంబంధించి ప్రాక్టికల్స్ నిర్వహించనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ సయ్యద్ యూసుఫ్ హుస్సేన్ తెలిపారు. జనవరి, ఫిబ్రవరి రెండు నెలల పాటు నిర్వహించే రివిజన్ తరగతు లకు విద్యార్థులు రెగ్యులర్‌గా వచ్చి కష్టపడి చదివితే ఇంటర్మీడియట్‌లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించవచ్చని ఆయన విద్యార్థులకు సూచించారు.

ప్రమాదవశాత్తు నివాసపు ఇల్లు దగ్ధం

- రూ.7 లక్షల ఆస్తి నష్టం

నవతెలంగాణ-పిట్లం


కాలిపోయిన నిత్యావసరాలు

మండలం లోని చిన్నకొడప్‌గల్ గ్రామానికి చెందిన వడ్ల లక్ష్మి, వడ్ల వెంకవ్వ నివాసపు ఇండ్లు శనివారం రాత్రి ప్రమాదవశాత్తు దగ్ధమైంది. సుమారు 7 లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్టు ఫైర్ స్టేషన్ అధికారులు అంచనా వేశారు. బాధితులు బోరున విలపించారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతి కావడంతో నిత్యవసర వస్తువులు , వంట సామాగ్రి , బట్టలు , పూర్తిగా దగ్ధమైనట్లు వారు పేర్కొన్నారు. బాన్సువాడ ఫైర్ స్టేషన్ కు సమాచారం ఇవ్వడంతో ఫైర్ ఇంజన్ వచ్చేసరికి నివాసపు ఇండ్లు దగ్ధమైనట్లు రోధిస్తూ , తమ బతుకులు రోడ్డు పాలు అయ్యాయని వాపోయారు.

నల్లని పొలంలో తెల్లని విత్తనాల్లాగా

నవతెలంగాణ-బోధన్



ప్రస్తుతం యాసంగి వరినాట్లు జోరందుకోవడంతో గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయం పనులపై రైతులు నిమగ్నమయ్యారు. ఉదయం నుండి రైతులు పంట పొలాలకు వెళ్లి ట్రాక్టర్లతో నాట్లకోసం మడులు సిద్ధం చేస్తున్నారు. దాంతో భూమిలో నుంచి బయటికి వచ్చే కీటకాల కోసం కొంగలు గుంపులు గుంపులుగా మడులలో వాలిపోతున్నాయి. దాంతో చూపరులకు నల్లని పొలంలో తెల్లని విత్తనాల అన్నట్లు దృశ్యాలు కనిపిస్తున్నాయి. ఆదివారం కల్దుర్కి సమీపంలో ఓ పంట పొలంలో నవతెలంగాణ కెమెరాకు చిక్కిన దృశ్యం..

వైకుంఠధామానికి సామాగ్రి వితరణ

నవతెలంగాణ-బోధన్



బోధన్ మండలం లంగ్డాపూర్ గ్రామంలోని వైకుంఠధామంలో గ్రామస్థుల సౌకర్యార్థం అంత్యక్రియలకు ఉపయోగించే కంపురాన్ని ఆదివారం అదే గ్రామానికి చెందిన రాణంపల్లి రవి తన తండ్రి కే.శే. రాములు జ్ఞాపకార్థం శ్మశాన వాటికకు అందించారు. దాంతో గ్రామస్థులు, సర్పంచ్ పవన్ ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సత్యనారాయణ, గంగాధర్ ,సుధాకర్ , శ్రీనివాస్ పటేల్, సుంకరి లక్ష్మణ్ , ఆనంద్ పటేల్ పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్ పునరుర్ధరణకు సహకరించాలి

- రేపటి దీక్షను జయప్రదం చేయండి



దీక్ష చేపట్టిన నాయకులు

నవతెలంగాణ-ఎడపల్లి

జనవరి 02న మండలకేంద్రంలోని గ్రామపంచాయతీ ముందర ఒకరోజు నిరాహార దీక్ష చేపట్టడం జరుగుతున్నదని, అఖిలభారత ప్రగతిశీల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్ముల గంగాధర్ ఆదివారం తెలిపారు. మండల కేంద్రంలో ఉన్న రైల్వేస్టేషన్ పునర్ నిర్మించాలని కోరుతూ ఈనెల 2న చేపట్టే దీక్షలో అన్ని రాజకీయ పార్టీల వారు పాల్గొని దీక్షను జయప్రదం చేయాలని కోరారు. మండల కేంద్రంలో రైల్వే స్టేషన్ ఉన్నప్పటికీ బోధన్-నిజామాబాద్ ప్యాసింజర్ రైలుఆగకపోవడం వల్ల ఎడపల్లి మండల ప్రజలతోపాటు చుట్టుపక్కల ప్రయాణికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు.

అదనపు గది నిర్మాణానికి భూమి పూజ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలో పద్మశాలి విజయ సంఘం గ్రామ శాఖ సంఘ భవనంలో అదనపు గది నిర్మాణానికి ఆదివారం భూమి పూజ చేశారు. కమ్మర్‌పల్లి పద్మశాలి సంఘం గ్రామ శాఖ అధ్యక్షులు చింత శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి అదనపు గది నిర్మాణం పనులను ప్రారంభించారు. అదనపు గది నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల పద్మశాలి సంఘం అధ్యక్షులు చింత తిరుపతి, పద్మశాలి సంఘం గ్రామ శాఖ కార్యవర్గం సభ్యులు అన్నం గణపతి రామ్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు చింత శ్రీ కుమార్, సంఘ సభ్యులు నారాయణదాస్, చింత నాగరాజు, తదితరులు పాల్గొన్నారు



అదనపు గది నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న చింత శ్రీనివాస్

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని గాంధీ నగర్‌కు చెందిన బాధిత కుటుంబానికి ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. గాంధీ నగర్‌కు చెందిన పల్లపు లక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మరణించారు. లక్ష్మీ పిల్లలు అనాథలయ్యారు. ఈ విషయాన్ని తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ బాధిత కుటుంబాన్ని ఆదుకునేందుకు రూ.5వేల ఆర్థిక సహాయం పంపించారు. ఈ మేరకు ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి, కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ పంపించిన రూ.5వేల ఆర్థిక సహాయం మొత్తాన్ని వారి కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుంకేట రవి, నాయకులు వేముల చిన్న గంగారెడ్డి, పాలెపు నర్సయ్య, బుచ్చి మల్లయ్య, నిమ్మ రాజేంద్రప్రసాద్, సల్లూరి గణేష్ గౌడ్, మారయ్య రవి, తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభోత్సవానికి సిద్ధమైన జిపి భవనం

నవతెలంగాణ-బోధన్

బోధన్ మండలం బండారుపల్లి గ్రామంలో గత ప్రభుత్వంలో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనం ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధమైంది. త్వరలో గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభోత్సవానికి ఏర్పాటు చేస్తున్నట్లు సర్పంచ్ చంద్రకళ సాయిలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ చంద్రకళ మాట్లాడుతూ.. నూతన గ్రామ పంచాయతీల ఏర్పాటులో భాగంగా కొత్తగా ఏర్పడిన బండారుపల్లి గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యాలయం లేక ఇరుకు గదిలో విధులు నిర్వహించడం కష్టంగా మారిందని తెలిపారు. దాంతో ఎంపీపీ బుద్దెసావిత్రి-రాజేశ్వర్‌ని సమస్య విన్నవించగా వారు గ్రామపంచాయతీ భవనం కోసం అప్పటి ఎమ్మెల్యే షకీల్ అమీర్‌తో మాట్లాడి నిధులు మంజూరు చేయించారని తెలిపారు. దాంతో గ్రామపంచాయతీ భవనానికి మంజూరైన 20 లక్షల రూపాయలతో భవనం నిర్మించడం జరిగిందని తెలిపారు. త్వరలో గ్రామపంచాయతీ భవనం ప్రారంభోత్సవానికి ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. గ్రామస్తులు సౌకర్యార్థం నూతన గ్రామపంచాయతీ భవనానికి కృషిచేసిన ఎంపీపీ బుద్దె సావిత్రి - బుద్దే రాజేశ్వర్ కు సర్పంచ్ చంద్రకళ సాయిలు గ్రామస్తుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.



ప్రభుత్వం మీద నిందలు మోపడం సరికాదు

- ప్రొసీడింగ్‌లపై నిలదీస్తారనే అసత్య ఆరోపణలు
- నిధుల మంజూరు పత్రాల పేరుతో మోసం కాంగ్రెస్‌పార్టీ మండలాధ్యక్షులు

నవతెలంగాణ-విలేకరులు

(వేల్పూర్) ఆర్మూర్ :ప్రభుత్వం మీద నిందలు మోపడం సరికాదని మండల కాంగ్రెస్ అధ్యక్షులు గడ్డం నర్సారెడ్డి అన్నారు. మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ప్రశాంత్ రెడ్డి ఎన్నికల్లో లబ్ధి పొందడానికి తన ఇష్టానుసారం కుల సంఘాల భవనా లకు, ఇతర పనులకు శిలాఫలంవేసి ప్రజలను మభ్యపెట్టి ఎమ్మెల్యేగా విజయం సాధించారన్నారు. కానీ ఎన్నికలకు ముందు మీరు ఇచ్చిన ప్రొసీడింగ్‌ల విషయంలో ఎక్కడ ప్రజలు నిలదీస్తారో అని కాంగ్రెస్ పార్టీ నాయకుల మీద ప్రభుత్వం మీద నిందలు వేసే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యేగా పూర్తి చేయించాల్సిన బాధ్యత మీదే లేకుంటే మిమ్మల్ని ఎక్కడికి అక్కడ నిలదీస్తామని ప్రశాంత్ రెడ్డికి హెచ్చరిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా జనరల్ సెక్రెటరీ దామోదర్ గౌడ్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు స్వరూప గౌడ్, మైనార్టీ మండల ప్రెసిడెంట్ మజీద్, నాయకులు నవీన్, చరణ్, రాజముత్యం ఇంద్ర గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

భీంగల్: బాల్కొండ నియోజకవర్గ ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి, అనుచరులు కాంగ్రెస్ పార్టీపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బోదిరెస్వామి అన్నారు. మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శనివారం బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి, ఆయన అనుచరులు గతంలో ఇచ్చినటువంటి పనులపై అధికార కాంగ్రెస్ ప్రభుత్వం పనులు జరగకుండా ఆపుతుందని అబద్ధాలు ప్రచారం చేస్తూ బాల్కొండ నియోజకవర్గ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని, ఇది సరికాదని అన్నారు. గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఇచ్చిన ప్రొసిడింగ్‌ల పనులను తప్పించుకు నేందుకే ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి ఆయన అనుచరులు బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి సునీల్ రెడ్డిపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. కనుక ఇప్పటికైనా అసత్య ఆరోపణలు మాని ప్రజలు ఏం కోరుకుంటున్నారో.. ఆ దిశగా పాలన అందించాల్సిన అవసరం ఉందని తెలిపారు. బాల్కొండ నియోజక వర్గంలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు చేస్తున్న ఆరాచకాలు అక్రమ భూదందాలు, అక్రమ ఇసుక రవాణా మొరం దోపిడీని ఆపాలని సూచించారు. కొంతమంది అధికారులు ఎమ్మెల్యే అండ చూసుకొని అక్రమార్కులకు వత్తాసు పలుకుతున్నారని అలాంటి అధికారులపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చర్యలు తప్పవని తెలిపారు. సమావేశంలో పల్లె శేఖర్, నల్లూరి శీను, కుర్తిలాల్, సేవాలాల్, రాజారెడ్డి, శివ, చిన్నారెడ్డి, మల్లేష్, ఆకాష్, రాజేందర్, నవిద్, జుబేర్, హజార్ హైమద్, వంశీ, అక్షయ్, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్మూర్ : మాట్లాడుతున్న పార్టీ మండలాధ్యక్షులు గడ్డం నర్సారెడ్డి

కమ్మర్‌పల్లి: బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదిన్నర సంవత్సరాలు అధికారంలో ఉండి కూడా పనులు చేయకుం డా ఎన్నికల ముందు లబ్ధి పొందాలన్న దురుద్దేశంతో కుల సంఘాలకు నిధుల మంజూరు పత్రాల పేర్లతో బీఆర్ఎస్ నాయ కులు ప్రజలను మోసం చేశారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుంకేట రవి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఆ పార్టీ మండల కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేవలం ఎన్నికల్లో లబ్ధి కోసమే కుల సంఘాలకు నిధుల పేరుతో, పేదలకు ఇండ్ల నిర్మాణం పేరుతో మూడు లక్షల రూపాయల ప్రొసీడింగ్స్ ఇచ్చి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. పేదలను ఆదుకోవాలని నిజంగా ప్రేమే ఉంటే బీఆర్ఎస్ పార్టీ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ. 5 లక్షలు ఇచ్చి ఇంటి నిర్మాణాలు పూర్తి చేయించే వారన్నారు. కేవలం ఎన్నికలకు వారం రోజుల ముందు నిధుల మంజూరు పత్రాలను ఇచ్చి మేము ఇచ్చామని చెప్పుకోవడం సిగ్గుచేటు అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, సునీల్ రెడ్డి అభివృద్ధిని అడ్డుకుంటున్నారని బీఆర్ఎస్ పార్టీ నాయకులు చెప్పడం వారి అవివేకానికి నిదర్శనం అన్నారు. సునీల్ రెడ్డి ఎన్నికల్లో ఓడిపోయిన నియోజకవర్గ అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి అభివృద్ధి జరిగేలా చేస్తారని తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు అభివృద్ధి విషయంలో కాంగ్రెస్ నాయకులపై బట్ట కాల్చి మీద వేసే విధంగా వ్యవహరించొద్దని హితవు పలికారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి తిప్పిరెడ్డి శ్రీనివాస్, నాయకులు పాలెపు నరసయ్య, నిమ్మ రాజేంద్రప్రసాద్, నూకల బుచ్చి మల్లయ్య, సింగిరెడ్డి శేఖర్, సల్లూరి గణేష్ గౌడ్, వేముల చిన్న గంగారెడ్డి, సుంకేట శ్రీనివాస్, కౌడ శైలేందర్, నల్ల సాయికుమార్, ఆల్గోట్ రంజిత్, జైడి బాలకృష్ణ, ఎడ్ల దీపక్ సాయి, సుంకరి గంగాధర్, మారయ్య, ఎడపల్లి రవి, కౌడ అరవింద్, పడాల గంగాధర్ ముత్యాల చంద్రకాంత్ రెడ్డి, పలారం పవన్ పాల్గొన్నారు.



కమ్మర్‌పల్లి : మాట్లాడుతున్న సుంకెట రవి



భీంగల్ : మాట్లాడుతున్న బొదిరె స్వామి

జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు: కలెక్టర్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఆంగ్ల నామ నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని జిల్లా ప్రజలకు కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు శుభాకాంక్షలు తెలిపారు. 2024 ఏడాది ప్రతి ఒక్కరికి శుభాలను చేకూర్చా లని, ప్రతి కుటుంబంలో ఆనందం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. జిల్లా ప్రజలందరు ఆయు రారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని అభిలషించారు. కొత్త ఏడాదిలో సరికొత్త ఆలో చనలు, ఆశయాలు, ఆకాంక్షలతో ముందుకు సాగాలని, ఎల్లవేళలా మంచి జరగాలనే ఆకాంక్ష వెలిబుచ్చారు.

పూల బొకేలు బదులు బుక్కులు, పెన్నులు

ఆంగ్ల నామాది నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని శుభాకాంక్షలు తెలియజేసేందుకు వచ్చేవారు పూల బొకేలకు బదులు నోట్ బుక్కులు, పెన్నులు, దుప్పట్లు వంటి వాటిని తీసుకురావాలని జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. శుభాకాంక్షల రూపకంగా సమకూరిన నోట్ బుక్కులు, పెన్నులు, దుప్పట్లను పేద విద్యార్థులకు అందజేయడం జరుగుతుంద న్నారు. కావున పూల బొకేలు అందించదల్చిన వారు వాటి స్థానంలో నోట్ బుక్స్, బ్లాంకెట్స్ అందిస్తే విద్యార్థులకు అవి ఎంతో ఉపయుక్తంగా నిలుస్తాయని అన్నారు.

కాగా నూతన సంవత్స రం సందర్భంగా జిల్లా పాలనాధికారి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (న్యూ కలెక్టరేట్)లో సోమవారం ఉదయం 11 గంటల నుండి అందు బాటులో ఉంటారని కలెక్టర్ కార్యాలయ అధికారులు తెలిపారు.

సీతారామాంజనేయ శోభయాత్ర

నవతెలంగాణ-మద్నూర్

అయోధ్య నుండి వచ్చిన శ్రీరాముని అక్షింతలను మద్నూర్ మండలంలోని పెద్ద ఎక్లారా గ్రామానికి చేరుకోగా శ్రీరాముని అక్షింతలను అయ్యప్ప సన్నిధి నుండి ఆ గ్రామ పెద్దలు మద్నూర్ సింగల్ విండో చైర్మన్ శ్రీనివాస్ పటేల్ అలాగే మాజీ సింగల్ విండో చైర్మన్ పండిత్‌రావు పటేల్, బిఆర్ఎస్ పార్టీ మండల యూత్ అధ్యక్షులు సుధాకర్ పటేల్ ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు కలిసి శ్రీరాముని అక్షంతల శోభయాత్ర వైభవంగా నిర్వహించారు. శోభాయాత్ర కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం అయ్యప్ప సన్నిధి నుండి గ్రామంలోని హనుమాన్ మందిరం వరకు నిర్వహించారు.

శోభయాత్రలో పాల్గొన్న సైంటిస్ట్

సదాశివనగర్ : సదాశివనగర్ మండల కేంద్రంలో ప్రముఖ శాస్త్రవేత్త డా.పైడి ఎల్లారెడ్డి అయ్యప్ప శోభాయాత్రలో పాల్గొన్న అనంతరం అయ్యప్ప ఆలయ నిర్మాణ అభివృద్ధికి ఆదివారం ఆయన 5,00,018/- రూ. విరాళం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అయ్యప్ప స్వామి కృపాకటాక్షాలు మండల ప్రజలకు నిరంతరం ఉండేలా తాను భాగస్వామ్యం కావడం సంతోషంగా వుందని తెలిపారు. అనంతరం అయ్యప్ప స్వామి మాల ధరించిన గురు స్వామి మాట్లాడుతూ ఎల్లారెడ్డి గారు సేవలు భవిష్యత్తులో జహిరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో విస్తరించాలని అభిలాషించారు.

గాంధారి : గాంధారి మండల కేంద్రంలో అయోధ్య రామ మందిర తీర్థ క్షేత్ర ట్రస్ట్ గాంధారి శాఖ ఆధ్వర్యంలో శ్రీ అయోధ్య రామ పూజిత అక్షింతలను గాంధారి మండల కేంద్రంలో ఘనంగా ఊరేగించారు. ఈ సందర్భంగా శ్రీ సీతరామాంజ నేయ శోభయాత్ర ప్రారంభించారు. గ్రామంలో ప్రధానవీధుల గుండా శోభయాత్ర నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు మాట్లాడుతూ జనవరి 22న అయోధ్య లో శ్రీ రాముడి ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా నిర్వహిస్తుండడంతో అయోధ్య లో బాలరాముడు క్షేత్రంలో 108 రోజులు ఎంతో నిగ్రత పూజింపబడిన అక్షింతలను వచ్చేనెల 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ప్రతి ఇంటికి పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. శోభాయాత్రలో గాంధారి సర్పంచ్ మమ్మాయి సంజీవ్ యాదవ్, అయ్యప్ప స్వాములు, బీజేపీ,కాంగ్రెస్, బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు గ్రామపెద్దలు యువకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.


మాచారెడ్డి : శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో అయోధ్య బాలఆలయంలో పూజలు అందుకున్న అక్షింతలు కలశాలు కరపత్రాలు చిత్రపటాలు ఆదివారం పాల్వంచ మండలంలోని భవానిపేట గ్రామానికి చేరుకున్నాయి. వీటిని స్థానిక హనుమాన్ మందిరంలో ఉంచి ప్రతిరోజు హనుమాన్ చాలీసా రామనామ జపంతో పారాయణం చేసి జనవరి ఒకటవ తేదీ నుండి ప్రతి ఇంటికి చేరుస్తామని నిర్వాహకులు తెలిపారు.

కూరగాయల హోల్ సేల్ మార్కెట్‌లో

ట్రాఫిక్ రద్దీపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

కూరగాయల హెూల్ సేల్ మార్కెట్ లో ట్రాఫిక్ రద్దీ పై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. నిజామాబాద్‌లోని శ్రద్ధానంద్ గంజ్‌లో గల కూరగాయల హెూల్ సెల్ మార్కెట్ లోపలికి బైక్, ఆటోలు, ఇతర పెద్ద వాహనాలు అధికంగా రావడం చాలా ఇబ్బంది అవుతుందని హమాలీలు అన్నారు. ముల్లె హమాలీలు నడవడానికి చాలా ఇబ్బంది పడుతున్నామని, సమయం చాలా దెబ్బతింటుంది శారీరకంగా ఇబ్బంది అవుతుందని, ప్రమాదాలు కూడా జరిగిన ఘటనలు ఉన్నాయని, గతంలో కూడా ఈ సమస్యను తమ దృష్టికి తెచ్చామని, కొన్ని నెలలు నియంత్రించారని తెలిపారు. తదుపరి మళ్లీ అదే పరిస్థితి కొనసాగుతుందని, మూటలు మోసే హమాలీలకు టైం చాలా తక్కువ అవుతుందని అన్నారు. దెబ్బలు తగులుతున్నాయని, మూటలు జారి కింద పడిపోతున్నాయని, వచ్చే వాహనాల మధ్యలో నుంచి వెళ్లడం కష్టంగా మారుతుందని తెలిపారు. ట్రాఫిక్ రద్దీ వల్ల బరువు ఎత్తుకొని ముందుకు కదలలేక కొన్ని సంద ర్భాల్లో వాహ నాల మ ధ్యలో బరువుతో నిల్చునే పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. దయచేసి హెూల్ సెల్ కూరగాయల మార్కెట్లో ట్రాఫిక్ రద్దీని అరికట్టాలని శ్రద్ధానంద్ గంజి హెూల్సేల్ కూరగాయల మార్కెట్ యజమానుల అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులకు మెమోరండం అందజేశారు. కార్యక్రమంలో హమాలీ కార్మికులు మోహన్, రాజు, మల్లేష్ బీరయ్య రైస్ గంగాధర్ విజయ్ ధర్మయ్య పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న హమాలీలు

వీఆర్‌ఏలకు 6 నెలల పెండింగ్ వేతనాన్ని వెంటనే చెల్లించాలి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

వీఆర్‌ఏలకు 6 నెలల పెండింగ్ వేతనాన్ని వెంటనే చెల్లిస్తూ, రిటర్మెంట్ బెనిఫిట్స్ 2 లక్షలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరిన సిపిఐ జిల్లా కార్యదర్శి పి. సుధాకర్ అన్నారు. సిపిఐ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమాదవేశంలో సుధాకర్ మాట్లాడుతూ..

రెవెన్యూ శాఖలో గతఎన్నో సంవత్సరాలుగా విధులు నిర్వహించిన వీఆర్‌ఏలను గత బిఆర్ఎస్ ప్రభుత్వం వీఆర్‌ఏ వ్యవస్థను రద్దుచేసి రాష్ట్రంలో ఉన్న ఇతర శాఖలకు బదిలీ చేసిందన్నారు. బదిలీ చేసి సుమారు ఆరు నెలలు గడుస్తున్న ఇప్పటికి వేతనం ఇవ్వకపోవడంవల్ల కొత్త శాఖలలో పనిచేస్తూ అనేక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా వెంటనే పెండింగులో ఉన్న ఆరు నెలల వేతనాలు చెల్లించాలని, 2023 డిసెంబర్ 30న 61 సంవత్సరాలు పూర్తయిన వీఆర్‌ఏలకు ప్రభుత్వం ఎలాంటి బెనిఫిట్స్ ఇవ్వకుండా సాగనంపుతున్నట్టు రిటర్మెంట్ లెటర్లు ఇచ్చిందన్నారు. ఇన్ని సంవత్సరాల కష్టానికి ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా పదవీ విరమణ చేయించడం సరికాదని అన్నారు. వారు గతంలో రెవెన్యూ శాఖలో చేసిన సేవలను గుర్తించి వారి వారసులకు ఉద్యోగం కోసం ఇవ్వాలని, ప్రస్తుతం రిటైర్మెంట్ అవుతున్న వీఆర్‌ఏలకు రెండు లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరుతున్నామని అన్నారు సమావేశంలో నాయకులు దేవేందర్, ఆనంద్ ,బాలకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా పద్మావతి మల్లన్న జాతర

నవతెలంగాణ-బోధన్

బోధన్ మండలం ఊటపల్లి గ్రామంలో మల్లన్న గుట్టపై వెలసిన పద్మావతి మల్లన్న కళ్యాణ మహోత్సవాన్ని ఆదివారం గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలు బోనాలతో డప్పు చప్పుళ్లతో మంగళ హారతులతో మల్లన్న గుట్టపైకి తరలివెళ్లారు. జాతర సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. జాతరకు సమీప గ్రామాలు, వివిధ మండలాల భక్తులు, మహిళలు భారి సంఖ్యలో తరలివచ్చారు. కాంగ్రెస్ నాయకులు పీసీసీ డెలిగేట్ గంగా శంకర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగేశ్వర్ రావు, సంజీవ్ రెడ్డి మల్లన్న పద్మావతిని దర్శించుకున్నారు. జాతర సంధర్బంగ గ్రామానికి చెందిన చామకూర మోహన్ రెడ్డి దంపతులు, సాయరెడ్డి,గంగారెడ్డి దంపతులు భాజ భజంత్రీలతో తరలివచ్చి స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.



బోనాలతో వస్తున్న మహిళలు

సంబురంగా కొత్త సంవత్సర వేడుకలు

నవతెలంగాణ-బోధన్



నూతన సంవత్సరం వేడుకల కోలాహలం ఆదివారం అర్ధరాత్రి యువత ఎప్పటిలాగే నిర్వహించుకుంది. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా దావత్‌ల, పార్టీలు జరుపుకున్నారు. దాంతో బోధన్ పట్టణంలో బేకరీ దుకాణాల వద్ద కేకుల విక్రయాలు భారీగా సాగాయి. వినియోగ దారులను ఆకర్షించడానికి దుకాణ దారులు ప్రత్యేక ఆఫర్లను అందించారు. మాంసం విక్రయి దుకాణాలు కిటకిటలాడాయి. యువత స్నేహితులతో విందు భోజనాలకు మద్యం విక్రయాల సైతం జోరుగా సాగాయి. నూతన సంవత్సర వేడుక సందర్భంగా వ్యాపార సంస్థలను అందంగా ముస్తాబు చేశారు.

రామాలయంలో అన్నదానం

నవతెలంగాణ-సిరికొండ



మండలంలోని తాళ్ల రామడుగు గ్రామంలో ఆదివారం రామా లయంలో రామా లయ చైర్మన్ బచ్చు పురుషక్షత్రం అయ్యప్ప స్వాములతో కలిసి మెట్ల పూజ, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో విడిసి సభ్యులు బండారి నరేష్, గ్రామ యువకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

మన్‌కీ బాత్‌లో అర్బన్ ఎమ్మెల్యే

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నిజామాబాద్ నగరంలోని 9వ డివిజన్ లో బీజేపీ ఖిల్లా మండల శాఖ ఎస్టీ మోర్చా అధ్యక్షులు సుందర్ రాథోడ్ వారి నివాసం లో టిఫిన్ బైఠక్ కార్యక్రమానికి ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ఆదివారం వెళ్లారు. అక్కడికి పెద్ద ఎత్తున కార్యకర్తలు రావడంతో వాళ్ళతో కలిసి ప్రధాన మంత్రి నిర్వహించే మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. ప్రధాని పేదల సమస్యలు వెలికి తీయడానికి ఈ మన్ కీ బాత్ కార్యక్రమం కొనసాగుతుంది అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు నాగోళ్ళ లక్ష్మి నారాయణ, మండల అధ్యక్షులు పుట్ట వీరేందర్,కోడూరు నాగరాజ్, సాయినాథ్,కిరణ్, మఠం పవన్, డివిజన్ నాయకులు బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి

విగ్రహ శిఖర ప్రతిష్ట మహోత్సవం

నవతెలంగాణ-ముప్కాల్

శాలివాహన (కుమ్మరి) సంఘం దేవాలయ కమిటీ ముప్కాల్ ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి విగ్రహ శిఖర ప్రతిష్ట మహోత్సవ ఉత్సవాలు సోమవారంనుంచి మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహిస్తామని దేవాలయ కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 3న బుధవారం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కుమ్మరి సంఘం పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు..

నేటి నుంచి వైద్య సేవలు అందుబాటులో

నవతెలంగాణ-ముప్కాల్

సోమవారం నుంచి ఈ నెల 4న గురువారం వరకు ముప్కాల్ మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో 'వికసిత్ భారత్ సంకల్ప యాత్ర' కార్యక్రమం నిర్వహించబడుతుందని ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రాకేష్ ఆదివారం రోజు ఒక ప్రకటనలో తెలిపారు. 'వికసిత్ భారత్ సంకల్ప యాత్ర' షెడ్యూల్ ను ఈ సందర్భంగా వారు ఆదివారం విడుదల చేశారు. ప్రతి గ్రామానికి వైద్య సేవలు అందించేందుకు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు రావడం జరుగుతుందని, వైద్య సేవలు అందించి, రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేస్తామన్నారు. కావున మండల ప్రజాప్రతినిధులు, మండల, గ్రామ స్థాయి అధికారులు కార్యక్రమంలో పాల్గొనాలని సూచించారు. షెడ్యూలు వివరాలు ఇలా ఉన్నాయని, సోమవారం వేంపల్లి గ్రామంలో, మధ్యాహ్నం ముప్కాల్ మండల కేంద్రంలో నిర్వహిస్తామని అన్నారు. 2న ఉదయం నల్లూర్, మధ్యాహ్నం కొత్తపల్లి, 3న నాగంపేట్, మధ్యాహ్నం రెంజర్ల గ్రామంలో నిర్వహిస్తామన్నారు. చివరి రోజైన 4న గురువారం వెంచిర్యాల గ్రామంలో కార్యక్రమాలు కొనసాగుతాయని వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పేర్కొన్నారు.

కూతురి జ్ఞాపకంగా సేవాకార్యక్రమాలు చేయడం అభినందనీయం

స్నేహ సొసైటీ నిర్వాహకులు, కార్యదర్శి సిద్దయ్య



బిస్కెట్లు పంపిణీ చేస్తున్న తల్లిదండ్రులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

కన్న కూతురు దూరమైన దివ్యాంగులు, అనాథల ఉన్నతి కోసం సహాయ సహకారాలు అందజేసేందుకు తల్లి దండ్రులు ముందుకు రావడం వారి మనవాత్వనికి, మంచి మనసుకు నిదర్శనమని స్నేహ సొసైటీ నిర్వాహకులు సిద్దయ్య ఆదివారం తెలిపారు. వారి కుటుంబానికి మనోధైర్యం కల్పించాలని ఆయన ఆకాక్షించారు.. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ముబారాక్ నగర్ ప్రాంతానికి చెందిన బివి రమణ రెడ్డి, లక్ష్మి దేవి కుమార్తె మాధవి రెడ్డి తొమ్మిది ఏళ్ళ క్రితం ప్రాణాలు కోల్పోయింది. అప్పటినుండి ప్రతి సంవత్సరం వారి కుమార్తె జ్ఞాపకంగా సేవా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందనీ తండ్రి రమణరెడ్డి, తల్లి లక్ష్మీదేవి, మేనత్త సుబ్బలక్ష్మి తెలిపారు. ఈ నేపథ్యంలోనే తమ కూతురు పుట్టిన రోజును స్నేహ సొసైటీలో దివ్యాంగుల మధ్య జరుపుకోవడం జరుగుతుందని తెలిపారు.. అనంతరం స్నేహ సొసైటీ నిర్వాహకులు సిద్దయ్య మాట్లాడుతూ.. తమ కూతురు కళ్ళ ముందు లేకపోయినప్పటికీ ప్రతి సంవత్సరం ఆర్థిక సహాయంతో పాటు దివ్యాంగ విద్యార్థులకు ఏదో ఒక రూపంలో సహాయ సహకారాలు అందించడం జరుగుతుందని వారు చెప్పారు. దివ్యాంగ విద్యార్థుల మధ్య తమ కూతురి జయంతి చేసుకోవడం తమ మనసులకు కొద్ది ఉపశమనం లభిస్తుందని తెలిపారు. కూతురి జ్ఞాపకార్థం 25వేల రూపాయల చెక్కును దివ్యాంగ విద్యార్థుల సంక్షేమం కోసం ఇవ్వడం జరిగిందని చెప్పారు. కార్యక్రమంలో స్నేహ సొసైటీ ప్రిన్సిపాల్ జ్యోతి, వైస్ ప్రిన్సిపల్ రాజేశ్వరి, స్నేహ సొసైటీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

నవతెలంగాణ-రెంజల్



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

రెంజల్ మండలంలోని పోలీస్ స్టేషన్ వద్ద ఎస్సై ఉదయ్ కుమార్ వాహనా లను తనిఖీ చేశారు. వాహనదారులు వాహనా లకు సంబంధించిన ధ్రువీ కరణ పత్రాలను కచ్చితంగా తమ వద్ద ఉంచుకోవాలని ఆయన సూచించారు. వన్ టైం సెటిల్మెంట్ కింద పెండింగ్లో ఉన్న డబ్బులను సైతం చెల్లించాలని ఆయన వాహనదారులకు ఆదేశించారు. ఆదివారం ఆరు గంటల సమయంలో ప్రధాన రహదారిపై తన సిబ్బందితో వాహనాలను తనిఖీ చేశారు

మున్సిపల్ స్థలాన్ని,రోడ్డును కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో మున్సిపల్ స్థలాన్ని, మున్సిపల్ రోడ్డును కబ్జా చేసి ఎటువంటి పర్మిషన్లు లేకుండా దాదాపుగా వెయ్యి గజాల స్థలంలో అక్రమంగా నిర్మిస్తున్న ఇంటి నిర్మాణ పనులను ఆపివేయాలని శరత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు ఒకరు సర్వే నెంబర్ 401/63లో కబ్జా చేశారని, 179/2005 అనే డూప్లికేట్ ఎల్పీ నంబర్‌తో రిజిస్ట్రేషన్ ఆయన భార్య తులసి పేరుమీద చేసుకున్నట్లు ఆరోపించారు. వెంటనే అక్రమ నిర్మాణాన్ని ఆపి మున్సిపల్ స్థలాన్ని ఆక్రమణ చేసిన వ్యక్తిపై చట్టరిత్యా చర్యలు తీసుకోవాలని కోరారు.

కాలంతోపాటు మారుదాం..

- 2024 కొత్త ఏడాది ప్రణాళికలతో..
- సమయపాలన, సానుకూల దృక్పథం అవసరం..
- ఒత్తిడిని జయిద్దాం
- ఆరోగ్యం కాపాడుకుందాం..
- పొదుపు పాటిద్దాం..

నవతెలంగాణ-ఆర్మూర్

కాలం మారుతుంది ..దాంతో పాటు మనము మారాల్సిందే ..గడిచిన సంవత్సరం ఎన్నికల కోలాహలం... ఈ సంవత్సరం కూడా ఎన్నికల జాతరే. కొత్త సంవత్సరంలో అయినా కొత్త ప్రణాళిక బద్ధంగా జీవిద్దాం. బిజీ లైఫ్ వేళాపాల లేని ఆహారపు అలవాట్లతో గతంలో కన్నా శరీర బరువు పెరిగింది. ఎప్పటినుంచో వాకింగ్, జిమ్ కు వెళ్లాలని ఆలోచనరేపటి నుంచి క్రమం తప్పకుండా వెళ్లాలని నిర్ణయించుకోవడం తర్వాత ఏవో కారణాలతో వాయిదా వేయడం ఇదొక్కటే కాదు.. చాలా అలవాట్లకు స్వస్తి పలకడం మంచి నిర్ణయాలు తీసుకోవడం.. కొత్త పనులకు శ్రీకారం చుట్టడం ఇలా బోలెడన్ని అనుకున్నా ఆచరణలో మాత్రం ఆగిపోతుంటాయి.. కానీ 20 24 అలా కాకూడదని తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి ఉండాలని గట్టిగా నిశ్చయించుకుందాం.. ఏదైనా ఒక నిర్ణయం తీసుకునే ముందు దాని సాధ్యాసాధ్యాలను ఆలోచించాలి.. మనతో అవుతుందనుకుంటే పాటించాలి.. కొంచెం కష్టమైనా పర్వాలేదు అనుకుంటే ట్రై చేయాలి.. కానీ సాధ్యం కానీ దాన్ని ఎన్నుకొని తర్వాత మధ్యలోనే వదిలిపెట్టేయడం మంచిది కాదంటున్నారు వ్యక్తిత్వ వికాస నిపుణులు.. కష్టతరమైన క్రమం తప్పకుండా చేస్తే అది అలవాటుగా మారుతుందనేది వారి అభిప్రాయం.. ఇక ఎప్పటికైనా తప్పకుండా పాటించాల్సినవి.... కొన్ని ఉన్నవి అవి ఏంటివో చూద్దాం..

దురలవాట్లకు స్వస్తి...

మనిషిని చెడు ఆకర్షించినంత వేగంగా మంచి ఆకర్షించదు.. కాబట్టి దురలవాట్లకు దూరంగా ఉండాలి.. ఒక్కసారే కదా అని పొరపాటున కూడా వాటి జోలికి వెళ్ళకూడదు.. దురలవాట్లకు ఒకసారి దగ్గర అయితే వాటిని నుంచి బయటపడడం తేలిక కాదు.. కాబట్టి కొత్త ఏడాదిలో వాటి జోలికి వెళ్లనని నిర్ణయించుకోవాలి.. మనసుని అదుపులో ఉంచుకుంటే అదేమి అసాధ్యం కాదు.. ఇవన్నీ పాటిస్తే మీకు ఇక విజయమే..

సమయపాలన..

మనలో బోలెడంత నైపుణ్యం ఉండొచ్చు చేయి తిరిగిన వ్యాపారి అయి ఉండొచ్చు కానీ సమయ పాలన లేకపోతే ఆయా రంగాల్లో రాణించడం కష్టం సమయం మనకు ఎంత ముఖ్యమో మిగతా వారికి అంతే అన్న సంగతి మర్చిపోకూడదు.. పనులను వాయిదా వేసే విధానాన్ని వెంటనే విడనాడాలి సమయాన్ని ఎంత బాగా ఉపయోగించుకుంటే అంత మేలు.

సానుకూల దృక్పథం..

చిన్నపాటి సమస్యకి నింగిపోవడం మంచి లక్షణం కాదు.. సమస్య వచ్చినప్పుడు సానుకూల దృక్పథంతో ఆలోచించాలి.. ప్రతి సమస్యకు ఒక పరిష్కారం ఉంటుందన్న సంగతి మర్చిపోకూడదు.. కష్టాలు ఎదురైనప్పుడు కుంగిపోకుండా మార్గాలు అన్వేషించాలి.. ఆత్మీయులతో చర్చిస్తే పరిష్కారం సులభంగా దొరకవచ్చు సానుకూల దృక్పథంతో ముందుకు సాగితే విజయం కళ్ళ ముందు సాక్షాత్కారం అవుతుంది.

ఒత్తిడిని జయించాలి...

వేగం సంతరించుకున్న జీవితాలలో ఒత్తిడి ఒక భాగం అయిపోయింది.. దీనికి తలొగ్గాము.. ఇక అంతే ఒత్తిడిని ఎదుర్కొనే వ్యూహాలు రచించాలి. దానిపై చేయి సాధిస్తే విజయం సొంతం అవుతుంది. ఇది చెప్పినంత సులభం కాకపోయినా సంకల్ప బలం ఉంటే పెద్ద కష్టమేమీ కాదు



మంచి వారితో స్నేహం చేయడం నలుగురిలో కలిసిపోవడం.. పుస్తక పఠనం,, యోగ ఇలాంటి వాటితో ఒత్తిడిని తరిమికొట్టవచ్చు.

నిరంతర విద్యార్థిగా ...

ప్రపంచం వేగంగా మారిపోతుంది.. కంప్యూటర్‌తో పోటీ పడాలి. నేర్చుకునే ధోరణి పెరగాలి.. ఎప్పటికప్పుడు అప్డేట్ కావాలి.. సమయం లేదని.. వీలు కాలేదని సాకులను కట్టి పెట్టాలి. విషయాలు తెలుసుకోవడంలో నిరంతర విద్యార్థిగా ఉంటేనే సక్సెస్ సొంతం అవుతుంది.

ఆరోగ్యమే మహాభాగ్యం..

ఆరోగ్యానికి మించిన ఆస్తి మరొకటి లేదు. ఇప్పుడు ఆరోగ్యంగానే ఉన్నాంగా సమస్య వచ్చినప్పుడు చూద్దాం అని చాలామంది ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం చేస్తుంటారు.. ఆ తర్వాత సమస్య వచ్చినప్పుడు బెంబేలెత్తి పోతుంటారు. దీనిని తప్పించుకునేందుకు రోజుకు అరగంట వ్యాయామం చేయాలి.. ఆలస్యమెందుకు ఈరోజు నుంచే ప్రారంభించి కొత్త ఏడాదిలో అలవాటుగా మార్చుకుందాం..


పొదుపు..

వచ్చింది ఖర్చులకే సరిపోవడం లేదు ..ఇక పొదుపా అని చాలామంది కొట్టి పారేస్తుంటారు.. జీతం వచ్చిందా.. ఖర్చు చేశామా ఇది కొందరి ధోరణి కానీ అవసరాలు చెప్పి రావు కాబట్టి నెలకు కొంతైనా పొదుపు కోసం తీసేసి నికిత సొమ్మును ఖర్చులకోసం వాడుకోవాలి.. పొదుపు ఏ రకంగా ఉండాలో మొదటే నిర్ణయం తీసుకోవాలి.. వచ్చిన జీతంలో వీలైనంతగా పొదుపు కోసం కేటాయిస్తే భవిష్యత్తు బంగారు మయమే.

సాయంతో తృప్తి..

ప్రపంచీకరణ జీవన విధానంలో వేగం పెరిగింది.. అపార్ట్మెంట్ల సంస్కృతి వచ్చాక ఎవరికి వారే అన్న ధోరణి పెరిగిపోతుంది. సంవత్సరాల తరబడి ఒక దగ్గరే ఉంటున్న పక్కింటి వారి పేర్లు కూడా తెలియని స్థితి.. మనకెందుకులే అన్న ధోరణి... మొదట దీనిని విడనాడాలి. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలి. బాధలో ఉన్న వారికి బాసటగా నిలవాలి. చేతనైనంత సాయం చేయాలి. సేవ దొరికే తృప్తి మరెందులోనూ ఉండదు.


కొత్త ఆలోచనలతో ముందుకు వెళ్లాలి



నేటి యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి సత్ప్రవర్తనతో ముందుకు వెళ్లాలి. దేశానికి వెన్నెముక నేటి యువత అయినందున ముందు తరాలకు ఆదర్శం కావాలి. ప్రణాళిక బద్ధంగా జీవించేందుకు ప్రయత్నం చేయాలి..

వెంకట్ గౌడ్, రిషిత్ మల్టీ స్పెషాలిటీ వైద్యులు, ఆర్మూర్.

ప్రజల సమస్యలను పరిష్కరిస్తా



ప్రజల సమస్యలు తెలుసుకొని ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలను పరిష్కరిస్తాను.. ప్రజలు మన కోసం వేసి చూడకుండా నేనే వారి వద్దకు వెళ్తాను. తద్వారా పరిష్కార మార్గాలు చూపిస్తాను. వారికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాను. ఈ కొత్త ఏడాదిలో నిధులు రాబట్టి అభివృద్ధి పనులు వేగంగా చేయాలని నిర్ణయించుకున్నాను.

పైడి రాకేష్ రెడ్డి, ఎమ్మెల్యే, ఆర్మూర్

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-ఆర్మూర్



తమ గురువును సన్మానిస్తున్న అప్పటి విద్యార్థులు

మండల కేంద్రం నందిపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్ఎస్సీ 75-76 బ్యాచ్‌లో చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయంగా ఖుదావంద్‌పూర్-జోర్పూర్ గ్రామాల మధ్య గల సామల గంగాధర్ ఫామ్ హౌజ్‌లో క్లాస్ మేట్స్ ఒకచోట కలిసి అప్పటి తమ గురువు తిరునగరి వెంకట చక్రధరస్వామి ని ఆహ్వానించి గత స్మృతుల్ని జ్ఞాపకాల్ని నెమరు వేసుకున్నారు. ఆదివారం 2023 సంవత్సరానికి వీడ్కోలు చెబుతూ 2024 సంవత్సరానికి ఆహ్వానం పలికారు. 2023 సంవత్సరం అందరి జీవితాల్లో వెలుగులు నింపి సంతోషాన్ని బాధలను అనుభవించి, వాటిని మర్చిపోయి నూతన ఉత్సాహంతో నూతన సంవత్సరం అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని గురువు ఆశీస్సులు పొందుతూ ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమం నిర్వాహకులు సామల గంగాధర్, ఉల్లి ప్రభాకర్ గౌడ్ లు మాట్లాడుతూ ఐదు దశాబ్దాల క్రితం క్లాస్మేట్స్ చిన్నప్పటి క్లాస్ మెట్స్‌తో సంవత్సరం చివరి గడపడం ఆనందంగా ఉందన్నారు. మా అందరికి విద్యాబుద్దులు నేర్పిన ఆదర్శ గురువుదేవులు తిరునగరి వెంకట చక్రధర స్వామి ఆశీస్సులతో తాము ఇంత వారమైనామంటే సారు బోధించిన చదువే కారణమని అన్నారు. గణితం, ఆంగ్ల భాషపై మక్కువ పెంచిన గురువుకు జీవితాంతం రుణపడి ఉంటామని, నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని కోరుకుంటూ శుభాకాంక్షలు తెలిపారు. శాలువ పుష్పగుచ్చాలతో ఘనంగా సన్మానించి ఆశీర్వచనాలను పొందారు. గురువు మాట్లాడుతూ కుటుంబంలో ప్రస్తుత తండ్రి పాత్ర చాలా గొప్పదని, ఓపికతో సమస్య పరిష్కార నైపుణ్యంతో మసలుకోవాలన్నారు. కార్యక్రమంలో లంక శ్రీధర్, చింత రమేష్, సోమేశ్వర్, శంకర్ గౌడ్, జలోజి, సమన్వయ కర్తగా జింధం నరహరి తదితరులు పాల్గొన్నారు.



శ్రీజను సన్మానిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

బాలికలు క్రికెట్‌లో రాణించడం హర్షణీయం

పిఆర్‌టీయూటీఎస్ జిల్లా సంఘం బాధ్యుల హర్షం

నవతెలంగాణ-ఎడపల్లి

నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన శ్రీజ అండర్ 17 క్రికెట్. పోటీల్లో నిజామాబాద్ జిల్లా తరపున సారథ్యం వహించారు. ఇటీవల రాష్ట్రస్థాయిలో జరిగిన బాలికల క్రికెట్ పోటీల్లో శ్రీజ ఉత్తమ క్రికెట్ కీపర్ కాకుండా బ్యాటింగ్ లో సైతం ప్రతిభ కనబరిచి జిల్లా కీర్తిని రాష్ట్రస్థాయిలో పేరు ప్రతిష్టలు తీసుకువచ్చారు. వరంగల్ జరిగిన బాలికల క్రికెట్ పోటీల్లో ప్రతిభ కనబరచడంతో, శనివారం రాత్రి నిజామాబాద్ పిఆర్‌టీయూ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శ్రీజను ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. నిజామాబాద్ జిల్లా పేరు ప్రఖ్యాతలను రాష్ట్రస్థాయి, జాతీయస్థాయిలో నిలబెట్టినందుకు ఆమెకు ఉపాధ్యాయ బృందంతోపాటు మండల పిఆర్టీయు టీఎస్ అధ్యక్షులు, ఉపాధ్యాయులు ఆమెకు అభినందించారు. పిఆర్‌టియు (టిఎస్) అధ్యక్షులు అభిమన్యు చెల్లెలు కూతురు శ్రీజ జాతీయస్థాయి క్రికెట్..పోటీల్లో ఎంపిక కావడంతో ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఘనంగా ముత్యాల సునీల్ కుమార్ జన్మదిన వేడుకలు



బాల్కొండలో..



భీంగల్‌లో..



ఏర్గట్లలో..



కమ్మర్‌పల్లిలో..



ముప్కాల్‌లో..

నవతెలంగాణ-విలేకరులు

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ మండల కార్యాలయం వద్ద ఆదివారం ఆ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇంచార్జి ముత్యాల సునీల్ కుమార్ జన్మదిన వేడుకలను మండల అధ్యక్షులు సుంకెట రవి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుంకెట రవి, నాయకులు, కార్యకర్తల సమక్షంలో కేక్ కట్‌చేసి మండల కాంగ్రెస్ పార్టీ తరపున సునీల్ కుమార్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పిరెడ్డి శ్రీనివాస్, నాయకులు పాలెపు నర్సయ్య, నిమ్మ రాజేంద్రప్రసాద్, నూకల బుచ్చి మల్లయ్య సింగిరెడ్డి శేఖర్, సల్లూరి గణేష్ గౌడ్, వేముల చిన్న గంగారెడ్డి, సుంకెట శ్రీనివాస్, కౌడ శైలేందర్, నల్ల సాయికుమార్, ఆల్గోట్ రంజిత్, జైడి బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

బాల్కొండ: ముత్యాల సునీల్‌కుమార్‌కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలుపుతూ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు కేక్ కట్ చేసి ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏర్గట్ల: మండలకేంద్రంలో బాల్కొండ అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జ్ ముత్యాల సునీల్ రెడ్డి జన్మదిన వేడుకల సందర్భంగా కేక్ కట్ చేసి, టపాసులు కాల్చి నినాదాలు చేస్తూ... సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు శివన్నోళ్ళ శివకుమార్, మండలాధ్యక్షులు సోమ దేవరెడ్డి,డీసీసీ డెలిగేట్ గడ్డం జీవన్ రెడ్డి, మండల రైతు విభాగం అధ్యక్షులు ముస్కు మోహన్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆడేం గంగాప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

భీంగల్: మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు స్వామి ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేశారు. సునీల్‌కుమార్ ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని, ఇలాగే ప్రజలకు సేవ చేస్తూ బాల్కొండ నియోజకవర్గం ప్రజల ఆశీర్వాదంతో ముందుకు నడవాలని కోరుకుంటూ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పల్లె శేఖర్, కుర్తి లాల్, నల్లూరి శీను, ప్రశాంత్, రాజారెడ్డి, రాజేందర్, నవీద్, జుబేర్, శివ, దిలీప్, తదితరులు పాల్గొన్నారు

ముప్కాల్: మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మగ్గిడి ముత్యం రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. గ్రామాల్లో సైతం సునీల్ కుమార్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు ఘనంగా చేపట్టారు. ముత్యం రెడ్డి మాట్లాడుతూ ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం గ్రామంలో ప్రజలకు పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మగ్గిడి ముత్యం రెడ్డి, జిల్లా నాయకులు చిన్నారెడ్డి, కిసాన్ ఖేత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బద్దం సాగర్ రెడ్డి, చందా రవి రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షులు రాజ్ కుమార్, రాజ్ వెంకట్, ఏలేటి విజయ్, సాజిత్, అబ్రార్, లోక సుభాష్, మల్లారెడ్డి, ముస్కు ముత్తెన్న పాల్గొన్నారు